సాక్షి
జోగులాంబ గద్వాల
శుక్రవారం | 27 | డిసెంబర్ | 2024



టూరిజం హబ్‌గా నల్లమల

నల్లమలను టూరిజం హబ్‌గా తీర్చిది ద్దుతామని మంత్రి కొండా సురేఖ అన్నారు.

వివరాలు 8లో ▸



పాలమూరులో క్రీడా సందడి

పాలమూరు మరో సీఎం కప్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వేదిక కానుంది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
28.1/20.2

వాతావరణం

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ చిరుజల్లులు కురుస్తాయి. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

చీపురు పట్టి.. రోడ్లు ఊడ్చి



గద్వాలటౌన్: తమకు న్యాయం చేయాలని, తమ ఉద్యోగ జీవితాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎస్‌ఏ కాంట్రాక్టు ఉద్యోగులు రోజుకో పద్ధతిలో వినూత్నంగా కార్యక్రమాలు చేపడుతూ నిరసన వ్యక్తం చేస్తు న్నారు. జిల్లాలోని విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్రశిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణం క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె 17వ రోజు కొనసాగింది. గురువారం సైతం కేజీబీవీ సీఆర్‌టీలు, సీఆర్పీలు, డీఎల్‌ఎంటీ, సీసీఓ, పీటీఐ, యూఆర్‌ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్లకార్డులు చేతబట్టి దీక్ష చేపట్టారు. అనంతరం ఉద్యోగులు రాజీవ్‌మార్గ్ రోడ్డును చీపుర్లు పట్టి రోడ్లు ఊడ్చీ తమ నిరసన తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని రెగ్యులర్ చేయాలని, అప్పటి వరకు కనీస వేతన స్కేల్‌ను అమలు చేయాలని కోరారు. సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు హుస్సేనప్ప, గోపాల్, ప్రణీత, ఎస్‌ఓలు శ్రీదేవి, ఆసియా బేగం, గోపిలత, విజయలక్ష్మి, చెన్నబసమ్మ, పద్మ, జనార్దన్, ఖాజా, సమి పాల్గొన్నారు.

ప్రజల పక్షాన అవిశ్రాంత పోరాటం

గద్వాల: పేదల కోసం అనచబడ్డ బతుకుల్లో వెలుగుల కోసం అవిశ్రాంత పోరాటాలు నడిపిన పార్టీ సిపిఐ అని జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి చౌరస్తాలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100వ ఈ శతజయంతి ఉత్సవాలును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాగర్‌దొడ్డి ఆంజనేయులు, మదుసు ధన్‌బాబు హాజరై జెండా ఆవిష్కరించి మాట్లాడారు. 100 సంవత్సరాల వ్యవధిలో కమ్యూనిస్టు పార్టీ ఎన్నో పోరాటాలు చేసి ఎన్నో విజయాలు సాధించిందని కొనియాడారు. కార్యక్రమంలో ఇక్బాల్‌పాష, పరేష్‌బాబు, వెంకటేష్, ప్రవీణ్, గోపాల్‌రావు, ఆశన్న, తిమ్మప్ప, వెంకట్రామిరెడ్డి ఉన్నారు.

మందా జగన్నాథంను పరామర్శించిన హరీశ్‌రావు

అలంపూర్: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ఎంపీ మందా జగన్నాథంను మాజీ మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురికాగా.. ఆయన హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యులతో మాట్లాడి ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

■ కాలేయ సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న మహబూబ్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తిని అతడి కుటుంబ సభ్యులు ఇటీవల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన డాక్టర్ ఆపరేషన్ చేయాలని సూచించగా.. ఆ వ్యక్తిని జాయిన్ చేశారు. తెల్లారి ఆపరేషన్ కాగా.. ఆ తర్వాత మూడు రోజుల పాటు చికిత్స అందించారు. ఐసీయూలో ఉన్న అతడిని చూసేందుకు కుటుంబసభ్యులు ఏ ఒక్కరిని అనుమతించలేదు. చివరకు నాలుగో రోజు సీరియస్‌గా ఉందని.. హైదరాబాద్‌కు తరలించాలని.. బిల్లు కడితే డిశ్చార్జి చేస్తామని చెప్పారు. బిల్లు పూర్తిగా కట్టే వరకు డిశ్చార్జి చేయలేదు. ఆ తర్వాత హడావుడిగా ఆ రోగిని అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మరుసటి రోజు మృతిచెందాడు. అక్కడ అసలు విషయం తెలిసింది. ముందు నుంచీ సదరు రోగి కండిషన్ బాగాలేదని. ఇప్పటికే రూ.3 లక్షల వరకు ఖర్చయిందని.. వాళ్లు ముందుగానే అన్ని సంతకాలు చేయించుకున్నారని.. ఏం చేసినా పోయిన ప్రాణం తిరిగి వస్తుందా అని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన ఓ వ్యకి ఇటీవల వెన్నెముకకు సంబంధించిన వ్యాధితో తెలంగాణ చౌరస్తా సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. ఏం పర్వాలేదు.. ఆరోగ్య శ్రీ ఉందని, ఉచితంగా చికిత్ర చేస్తామని... ఓ వైద్యపరికరాన్ని (ఇంప్లాంట్) అమర్చాలని డాక్టర్ చెప్పారు. అయితే ప్రభుత్వం నుంచి వచ్చేది తక్కువ నాణ్యత ఉంటుందని.. మంచి ఇంప్లాంట్ పెట్టాలంటే మీకు రూ.50 వేల నుంచి రూ.60 వేలు పడుతుందని వివరించి.. ఒప్పందం చేసుకున్నారు. ...పలు ప్రైవేట్ ఆస్పత్రులు రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయనే దానికి ఇవి ఉదాహరణలు మాత్రమే. వైద్యారోగ్య శాఖ పట్టింపులేని తనంతో ప్రైవేట్ హాస్పిటళ్ల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాల పరిధిలో వైద్యసేవల పేరిట దోపిడీకి పాల్పడుతున్న పలు ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాకంపై 'సాక్షి' ఫోకస్..

- సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

ఆస్పత్రుల్లో జలగలు..!

ప్రైవేట్ హాస్పిటళ్లలో దోపిడీ పర్వం



- యాజమాన్యాల ఇష్టారాజ్యం
- రోగికి వైద్యంపై చివరి వరకూ సస్పెన్స్
- చివరలో హైదరాబాద్‌కు తరలించాలంటూ హడావుడి
- జనరల్‌తో పాటు 'ఆరోగ్యశ్రీ' రోగుల నుంచీ అదనపు వసూళ్లు
- పట్టించుకోని వైద్యారోగ్య శాఖ అధికారులు

జిల్లాల వారీగా ప్రైవేట్ ఆస్పత్రులు ఇలా..

మహబూబ్‌నగర్	నాగర్‌కర్నూల్	నారాయణపేట	జోగులాంబ గద్వాల	వనపర్తి
184	139	152	38	36

ఆస్పత్రిలో చేరిన రోగి నుంచి వీలున్న మేరకు దోచుకోవాలనే లక్ష్యంతో వ్యవహరిస్తున్నారు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రైవేట్ హాస్పిటళ్ల నిర్వాహకులు. దగ్గు, జలుబు వంటి చిన్నపాటి ఇబ్బందులతో వచ్చినా.. పరీక్షల పేరిట అందిన కాడికి దండుకుంటున్నారు. పలు రకాల ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చేరిన రోగి పరిస్థితి ఏమిటో చెప్పకుండా.. ఐసీయూలో ఉన్నారని.. ఇన్ఫెక్షన్ వస్తుందని.. సహాయకులను పంపించకుండా.. రోజుల తరబడి వైద్యం పేరిట లక్షలాది రూపాయలు దోచుకుంటున్నారు. అంతేకాదు చివరకు చేతులెత్తేస్తూ.. మరో ఆస్పత్రికి రెఫర్ చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు.

ఇంప్లాంట్ పేరిట అదనపు వసూళ్లు..

ఎముకలు, కీళ్ల సంబంధిత వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారితో పాటు ప్రమాదాల్లో కాళ్లు, చేతులు ఇతరత్రా ఫ్యాక్చర్ అయిన వారు చికిత్స కోసం ప్రధానంగా ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా శస్త్ర చికిత్స చేస్తారని.. ప్రభుత్వ ఆస్పత్రుల కంటే మెరుగైన వైద్యం అందిస్తారనే ఉద్దేశంతో పేద, మధ్య తరగతులకు చెందిన వారు ఎక్కువగా ప్రైవేట్ హాస్పిటళ్ల వైపు మొగ్గు చూపుతున్నారు. దీన్ని పలు ప్రైవేట్ ఆస్పత్రులు ఆసరాగా చేసుకుని దండుకుంటున్నాయి. ఫ్యాక్చర్ అయినప్పుడు అమర్చే ఇంప్లాంట్స్ పేరిట రోగులను మాయం చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే ఇంప్లాంట్ నాణ్యత ఉండదని.. విదేశాల నుంచి నాణ్యతతో కూడిన ఇంప్లాంట్ వేస్తామని ఒక్కొక్కరి నుంచి రూ.60 వరకు వసూలు చేస్తున్నట్లు రోగులు చెబుతున్నారు. అంతే కాదు పలు ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్య శ్రీ కింద చేరిన రోగులను రెండు రోజుల్లోనే డిశ్చార్జి చేసి.. వారం, పది రోజుల వరకు ట్రీట్‌మెంట్ ఇచ్చామంటూ మందుల, బెడ్ ఇతరత్రా చార్జీలు వేసి ప్రభుత్వానికి బిల్లులు సమర్పిస్తున్నట్లు సమాచారం.

సీరియస్ అంటూ డెలివరీకి రూ.50 వేలు..

ఉమ్మడి జిల్లాలో 549 ప్రైవేట్ ఆస్పత్రులు/క్లినిక్‌లు ఉండగా.. అనధికారికంగా మరో 300 వరకు ఆస్పత్రులు, క్లినిక్‌లు వెలిశాయి. ప్రైవేట్ ఆస్పతుల్రకు ప్రసవం కోసం వస్తున్న గర్భిణులను సీరియస్‌గా ఉందంటూ ఒత్తిడి చేస్తూ సిజేరియన్ల పేరుతో రూ. 40 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు దందాకు తెగబడుతున్నా.. వైద్యారోగ్య శాఖ అధికారులు మిన్నకుండి పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సాక్షి ఫోకస్

ఇవి మిస్టరీనే..

■ జోగుళాంబ గద్వాల జిల్లా అయిజకు చెందిన కవిత శ్వాస తీసుకోవడంతో ఇబ్బంది పడుతూ ఇటీవల గద్వాలలోని శివ బాలాజీ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చింది. శస్త్ర చికిత్స ద్వారా ముక్కులో పెరిగిన కండను తీసేయాలని డాక్టర్ సూచించగా అడ్మిట్ అయింది. శస్త్ర చికిత్స సమయంలో మహిళ పరిస్థితి విషమంగా ఉందంటూ.. మెరుగైన చికిత్స కోసం ఏపీలోని కర్నూలుకు తరలించారు. రెండు రోజుల చికిత్స అనంతరం మహిళ మృతి చెందింది. ఈ సంఘటనపై గద్వాల పోలీస్‌స్టేషన్‌లో సదరు వైద్యుడిపై కేసు నమోదైంది.

■ నాగర్‌కర్నూల్ జిల్లాలో మూడు నెలల క్రితం ఓ గర్భిణి ప్రసవం కోసం ప్రైవేట్ ఆస్పత్రిలో చేరింది. డెలివరీ సమయంలో గర్భిణి మృతి చెందింది. ఆ సమయానికి వైద్యులు లేకపోయినా.. ఆమెను అడ్మిట్ చేసుకున్నారని.. డాక్టర్ వేరే చోట ఉండి, కింది స్థాయి సిబ్బందితో ఫోన్‌లో టచ్‌లో ఉంటూ డెలివరీకి ప్రయత్నించారని.. దీంతో మృతి చెందిదంటూ ఆమె బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు.

■ గద్వాల మండలానికి చెందిన ఓ గర్భిణి జూన్ 9న ప్రసవం కోసం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరింది. వైద్యులు శస్త్రచికిత్స చేసి బిడ్డను బయటకు తీశారు. ఈ క్రమంలో బాలింత పరిస్థితి విషమంగా ఉందంటూ మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. అక్కడి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.

■ గద్వాల పట్టణానికి చెందిన ఓ గర్భిణిని కుటుంబ సభ్యులు ప్రసవం కోసం అనంత మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేర్పించారు. శస్త్ర చికిత్స ద్వారా ప్రసవం చేశారు. అయితే సదరు మహిళ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆ తర్వాత హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది.

ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం..



ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి.. చర్యలు తీసుకుంటున్నాం. ఫిర్యాదులపై సత్వరమే స్పందించి విచారణ చేపడుతున్నాం. బాధ్యులైన వైద్యులు, ఆస్పత్రుల నిర్వాహకులు ఎవరైనా సరే రోగుల ప్రాణాలతో చెలగాట మాడితే ఉపేక్షించేది లేదు.

- డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, డీఎంహెచ్‌ఓ, నాగర్‌కర్నూల్

పాలమూరులో మన్మోహన్‌సింగ్ జ్ఞాపకాలు

- ప్రధానమంత్రి హోదాలో రెండుసార్లు పర్యటన



ధర్మాపూర్‌లో ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబసభ్యులతో సంభాషిస్తున్న ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్, చిత్రంలో అప్పటి దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, కేంద్రమంత్రి కె.చంద్రశేఖరరావు (ఫైల్)

స్టేషన్ మహబూబ్‌నగర్: మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ ఉమ్మడి పాలమూరు జిల్లాలో రెండుసార్లు పర్యటించారు. ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన తొలిసారి జూలై 1, 2004న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా ధర్మాపూర్ గ్రామంలో దివంగత నేత, మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డితో కలిసి పర్యటించారు. గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలతో సంభాషించారు. వారికి భరోసా కల్పించి ప్రభుత్వం తరఫున 13 మంది రైతు కుటుంబాలకు రూ.19.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించారు. అదేవిధంగా ధర్మాపూర్ గ్రామంలో వివిధ అభివృద్ధి పనులకు ప్రత్యేక ప్యాకేజీ కింద రూ.45 లక్షలు ప్రకటించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు.

■ రెండోసారి మన్మోహన్‌సింగ్ అక్టోబర్ 26, 2006న ప్రస్తుతం వనపర్తి జిల్లా కొత్తకోటలో పర్యటించారు. నాగ్‌పూర్ మీదుగా హైదరాబాద్ నుంచి బెంగళూర్‌కు ఏడో నంబర్‌జాతీయ రహదారి (ప్రస్తుతం 44) నాలుగు వరుసల జాతీయ రహదారి విస్తరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

గద్వాలటౌన్: ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు జనగామ జిల్లాలో జరిగే 50వ జూనియర్ రాష్ట్రస్థాయి బాలుర కబడ్డీ పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేశారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ స్నిగ్ధారెడ్డి ఆదేశాల మేరకు అసోసియేషన్ జిల్లా కన్వీనర్ అబ్రహం, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బండల వెంకట్రాములు జిల్లా జట్టును ప్రకటించారు. రాష్ట్రస్థాయి పోటీలకు అరవింద్, అజిత్‌కుమార్, గోవర్ధన్, కే.రమేష్, శ్రీధర్, వంశీ, విష్ణు, వీరేష్, రమేష్, రాజు, విజయ్, గిరిబాబు ఎంపిక చేశారు. జిల్లా జట్టుకు కోచ్‌గా తిరుపతి, మేనేజర్‌గా సురేష్ వ్యవహరిస్తారు. జిల్లా జట్టు తరుపున ఆడే క్రీడాకారులకు గురువారం స్టేడియంలో జెర్సీలను అందజేశారు. రాష్ట్రస్థాయి పోటీలలో సత్తా చాటాలని కన్వీనర్ అబ్రహం సూచించారు.

ముందడుగు..

'సంపూర్ణ అభియాన్'తో మారనున్న గట్టు రూపురేఖలు

- ఉమ్మడి జిల్లాలో వెనుకబడిన ప్రాంతంగా మండలం ఎంపిక
- నీతి ఆయోగ్ ద్వారా అన్ని రంగాల్లో మండల అభివృద్ధికి చర్యలు
- ఆరోగ్యం, పోషణ, విద్య, మౌళిక వసతుల కల్పనపై దృష్టి
- 547 మహిళా సంఘాలకు రూ.17.42 కోట్ల రుణాలు
- నేడు గట్టు మండలంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ పర్యటన



పెంచికలపాడులో ఆధునీకరించిన అంగన్‌వాడీ కేంద్రం

గట్టు: వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ ప్రణాళికను అమలు చేస్తోంది. ఈమేరకు నీతి ఆయోగ్.. సంపూర్ణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా దేశ వ్యాప్తంగా 500 వెనుకబడిన మండలాలను గుర్తించి వాటి అభివృద్ధికి చర్యలు చేపట్టింది. అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ముందుకు సాగుతోంది. ఈమేరకు అక్షరాస్యతలో అట్టడుగులో ఉన్న జిల్లాలోని గట్టు మండలాన్ని ఎంపిక చేసింది. జూలై 4, 2024లో సంపూర్ణ అభియాన్ కార్యక్రమాలను గట్టు మండలంలో అమలు చేస్తున్నారు. ఆరోగ్యం, పోషణ, విద్యతో పాటుగా మౌళిక వసతులను కల్పించే ఉద్దేశంతో కార్యచరణ ప్రణాళికను అధికారులు అమలు చేస్తున్నారు. ఆస్పిరేషన్ బ్లాక్ ప్రోగ్రామ్ (ఏబీపీ)ద్వారా అధికారులు నిత్యం వివిధ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రగతి సాధించేందుకు ముందడుగు వేస్తున్నారు.

ఆదర్శ అంగన్‌వాడీలుగా..

గట్టు మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రాలుగా రూపుదిద్దుతున్నారు. భవిష్యభారత్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ స్వచ్ఛంద సంస్థ సహకారంతో గట్టు మండలంలోని 12 గ్రామాలను ఎంపిక చేసుకున్నారు. ఇందులో ఇప్పటికే పెంచికలపాడు-1,బల్గేర-2, గొర్లఖాన్ దొడ్డి-2, తప్పెట్లమొర్సు-1,యల్లందొడ్డి-1 అంగన్‌వాడీ కేంద్రాలను మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలుగా తీర్చిదిద్దారు. శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి, వాటిని మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చే పనిలో పడ్డారు. కేంద్రాలకు వాల్ పెయింటింగ్, గోడలపై చిత్రాలు, మ్యాపులు కిచెన్‌గార్డెన్, ప్రీస్కూల్ కిట్టులు, మంకి బాల్స్, బెడ్‌షీట్లుతో పాటుగా కొన్ని పరికరాలను అందజేశారు. గట్టు మండలాన్ని మూడు సెక్టార్లుగా విభజించారు. మాచర్ల సెక్టారులో 25 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 7 నెలల నుంచి 6 ఏళ్ల వయస్సు పిల్లలు 1625 మంది ఉన్నారు. వీరిలో అతి తక్కువ బరువున్న, సాధారణ బరువు ఉన్న పిల్లలను గుర్తించి వారికి విధిగా పౌష్టికాహారం అందించి సాధారణ స్థితి వచ్చేలా చేయడంలో సఫలమయ్యారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి..

ఆస్పరేషన్ బ్లాక్ ప్రోగ్రామ్‌లో భాగంగా గట్టు మండలంలో 2024-25 సంవత్సరానికి గాను మొత్తం 542 సంఘాలకు రూ.17.42 కోట్ల రుణాలను ఇచ్చేందుకు అధికారులు నిర్ణయించారు. 2024 ఏప్రిల్ నుంచి ఇప్పటి దాకా మొత్తం 342 సంఘాలకుగాను రూ.13.42కోట్ల విలువైన రుణాలను అందజేసినట్లు ఐకేపీ అధికారుల లెక్కల ద్వారా తెలిసింది. 2025 మార్చి నాటికి మిగతా 200 సంఘాలకు రూ.4 కోట్ల రుణాలను ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రివ్వాల్వింగ్ ఫండ్ ద్వారా ప్రతి సంఘానికి రూ.10 వేల మాదిరిగా 140 గ్రూపులకు రూ.లక్షా 40 వేలను అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

తక్కువ ధరకు వ్యవసాయ పరికరాలు

వ్యవసాయ శాఖ అధికారులు ఎఫ్‌పీఓ(ఫార్మర్ ప్రడ్యూస్ ఆర్గనైజేషన్) ద్వారా తక్కువ ధరకు వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, ఎరువులను అందిస్తున్నారు. గట్టు మండలంలో 620 మంది రైతులతో బంగారు గట్టు రైతు సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ సంఘంలో ప్రతి రైతు రూ.1100 చెల్లించి సభ్యులుగా చేర్చారు. ఏడాది కాలంలో రూ.26లక్షల విలువ చేసే పరికరాలు, విత్తనాలను రైతులకు అందించారు. రైతులకు మామిడి, చినీ మొక్కలను కూడా ఈ సంఘం అందించింది. రైతులు పండించిన మామిడి, బత్తాయిని మార్కెటింగ్ చేస్తున్నారు.

నేడు గట్టుకు కేంద్ర మంత్రి

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శుక్రవారం గట్టుకు రానున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు ఏర్పాట్లను పరిశీలించారు. గట్టులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మంత్రి సమీక్ష నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చెన్నయ్య తెలిపారు.

లోపాలను అధిగమిస్తున్నాం

పోషణ లోపాలను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అంగన్‌వాడీ సెంటర్ల పరిధిలో ప్రతి నెలా చిన్నారుల బరువులను కొలిచి, అతి తక్కువ బరువు ఉన్న పిల్లలను గుర్తించి, వారిని సాధారణ స్థితికి చేరుకునే విధంగా నిరంతర పర్యవేక్షణ చేస్తున్నాం. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యలక్ష్మీ ద్వారా వేడివేడి భోజనం అందిస్తున్నాం.

- హేమలత, మల్దకల్ ప్రాజెక్టు సీడీపీఓ

వంద శాతం ఫలితాలు..

సంపూర్ణ అభియాన్ ద్వారా గట్టు మండలంలో 39 అంశాలపై 14 శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని ముందుకు సాగుతున్నాం. ఇప్పటికే 4 అంశాలు బీపీ, షుగర్, గర్భిణుల నమోదు, మహిళా సంఘాలకు రివ్వాల్వింగ్ ఫండ్ వంటి వాటిలో వంద శాతం ఫలితాలను సాధించాం. మరో రెండింటిలో వంద శాతం ఫలితాలను సాధించేందుకు కృషి చేస్తాం.

- అఫ్జల్, నీతి అయోగ్ జిల్లా కోఆర్డీనేటర్

సైన్స్ పండుగకు వేళాయె..

నేటి నుంచి జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

- 175 పాఠశాలల నుంచి 250 వరకు ప్రయోగాలు
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా విద్యా శాఖ అధికారులు
- కలెక్టర్, ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభం



ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాట్లను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

గద్వాలటౌన్: జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనకు రంగం సిద్ధమైంది. ఇందుకోసం జిల్లా విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈనెల 27వ తేదీ నుంచి 28వ తేదీ వరకు స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలను నిర్వహిస్తున్నారు. రెండు రోజుల పాటు జరిగే వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాట్లను డీఈఓ అబ్దుల్‌ఘనీతో పాటు పలువురు సైన్స్ అధికారులు, జీహెచ్‌ఎంలు గురువారం పరిశీలించారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పరిధిలోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలు ప్రదర్శనల్లో పాల్గొంటున్నాయి. జిల్లాలోని 13 మండలాల పరిధిలోని 175 పాఠశాలల నుంచి సుమారు 250 వరకు ప్రయోగాలను విద్యార్థులు ప్రదర్శించనున్నారు. ఇందులో 2023-24 సంవత్సానికి సంబంధించిన ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల ప్రదర్శన తప్పనిసరి చేశారు. జూనియర్ (6,7 తరగతులు), సీనియర్ (8,9,10 తరగతులు) రెండు విభాగాలుగా విభజించి వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు.

క్విజ్.. వ్యాసరచనతోపాటు ప్రత్యేక కార్యక్రమాలు

ప్రదర్శనకు హాజరైన విద్యార్థులకు సాయంత్రం వేళల్లో ప్రత్యేక పోటీ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస, సెమినార్, సైన్స్ సంబంధిత డ్రామాలు సైతం ఏర్పాటు చేశారు. 'సుస్థిర భవిష్యత్తు కోసం- చిరుధాన్యాలు' అంశంపై సెమినార్ ఏర్పాటు చేశారు. ఇందుకోసం 20 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి ప్రదర్శనకు వచ్చే విద్యార్థులకు, ఉపాధ్యాయులకు భోజనం, వసతి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి పాఠశాల నుంచి రెండు ప్రదర్శనలకు మాత్రమే అనుమతించారు. వైజ్ఞానిక ప్రదర్శనకు సంబంధించి ఏర్పాటు చేసిన కమిటీలు ఆయా పనుల్లో నిమగ్నమయ్యారు. సీనియర్, జూనియర్ విభాగాల నుంచి ప్రతి అంశంలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన మొత్తం 14 ప్రదర్శనలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. ఇతర జిల్లాలకు చెందిన విద్యావేత్తలు న్యాయనిర్ణేతులుగా వ్యవహరించనున్నారు. వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించడానికి వచ్చే పాఠశాల విద్యార్థులకు సైతం తగిన ఏర్పాట్లు చేశారు. 'సుస్థిర అభివృద్ధి కోసం- శాస్త్ర సాంకేతికత' అనే అంశంపై నిర్వహిస్తున్న వైజ్ఞానిక ప్రదర్శనల్లో ఏడు ఉప అంశాలను చేర్చారు.


వైజ్ఞానిక ప్రదర్శనలోని అంశాలు..

- ఆహారం, ఆరోగ్యం- పరిశుభ్రత
- రవాణా -కమ్యూనికేషన్
- సహజ వ్యవసాయం
- విపత్తుల నిర్వహణ
- వ్యర్థాల నిర్వహణ
- గణిత నమూనాలు అండ్ గణన ఆలోచన
- వనరుల నిర్వహణ

హాజరుకానున్న ప్రజాప్రతినిధులు..

జిల్లాస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనకు కలెక్టర్ సంతోష్, గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నారు. శుక్రవారం ఉదయం స్థానిక అనంత ఫంక్షన్‌హాల్‌లో జరిగే ప్రారంభోత్సవానికి వీరందరూ హాజరవుతున్నారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేయాలని అధికారులు కోరారు. ఈ ప్రదర్శనకు 'శ్రీనివాస రామానుజన్' అనే పేరును నామకరణం చేశారు.

భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకే..



సైన్స్‌పై విద్యార్థులలో దాగివున్న నైపుణ్యాలను వెలికి తీస్తూ భావి శాస్త్రవేత్తలుగా తయారు కావడానికి వైద్య వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయి. విద్యార్థులకు సైన్స్ పట్ల సరైన దృక్పథాన్ని కల్పించడం, శాస్త్రీయ నైపుణ్యాలు పెంపొందించడం, నిత్య జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తూ శాస్త్రీయ దృక్పథాలపై సరైన అవగాహన కల్పించడం జరుగుతుంది.

- అబ్దుల్‌ఘనీ, డీఈఓ

క్లుప్తంగా

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

గద్వాల: జిల్లాకేంద్రంలో గుట్టుగా కొనసాగుతున్న వ్యభిచార గృహంపై దాడి చేసి ఇద్దరు విటులు, ఇద్దరు నిర్వాహకులు, ఓ మహిళను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. పట్టణానికి చెందిన వెంకీ, మల్దకల్ మండలం పాలవాయికి చెందిన తరుణ్ గద్వాల పాత హౌసింగ్‌బోర్డులో వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేయగా నిర్వాహకులు, విటులతో పాటు ఒడిస్సాకు చెందిన ఓ మహిళ పట్టుబడింది. అందరినీ అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

కణితిని చంపిన నిందితులు అరెస్టు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎల్లూరు శివారులో కేఎల్ఐ ప్రాజెక్టు జీరో పాయింట్ మంగల్ దూప్‌పెంట వద్ద ఉచ్చు బిగించి కణితిని చంపిన వేటగాళ్లను గురువారం అరెస్టు చేసినట్లు ఫారెస్ట్ రేంజర్ చంద్రశేఖర్ చెప్పారు. వివరాలిలా.. బుధవారం సాయంత్రం అమరగిరి సెక్షన్ అధికారి భయన్న, బీట్ అధికారి లక్ష్మయ్య సిబ్బందితో కలిసి మంగల్ దూప్‌పెంట సమీపంలో తనిఖీలు నిర్వహించగా కణితి మాంసాన్ని పంచుకుంటున్న అమరగిరి చెంచుగూడేనికి చెందిన నిమ్మల వెంకటస్వామి, బోడబండతండాకు చెందిన దేశావత్ నర్సింహలను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసి గురువారం కొల్లాపూర్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారన్నారు. దాడుల్లో ఫారెస్టు బీట్ అధికారులు నవీన్‌కుమార్, నాగార్జున, కిరణ్‌కుమార్, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

హైవేపై కోళ్ల వాహనం బోల్తా



ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తా సమీపంలో జాతీయ రహదారిపై కోళ్లను తరలిస్తున్న బొలెరో వాహనం బోల్తా పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. భూత్పూర్ నుంచి కర్నూల్‌కు బొలెరోలో గురువారం తెల్లవారుజామున కోళ్లను తరలిస్తుండగా డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా వాహనం అదుపు తప్పి బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న కోళ్లన్నీ మరణించినట్లు వారు పేర్కొన్నారు. డ్రైవర్ రంగస్వామి, క్లీనర్ మన్యం కు గాయాలు కావడంతో చికిత్స కోసం 108 వాహనంలో కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

గుర్లపల్లి వాగులో 8 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



మక్తల్: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 8 ట్రాక్టర్లను పట్టుకున్న ఘటన మక్తల్ మండలంలోరి గుర్లపల్లిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్లపల్లి సమీపంలోని వాగులో ఇసుకను అక్రమంగా ట్రాక్టర్లలో నింపుతున్న సమయంలో పోలీసులు అక్కడికి వెళ్లగా.. డ్రైవర్లు ట్రాక్టర్లను వదిలి పారిపోయారు. దీంతో పోలీసులు 8 ట్రాక్టర్లను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి, ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు. అనుమతి లేకుండా వాగులో నుంచి ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

- న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్ ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన



పోలీస్‌స్టేషన్ ఎదుట బాధిత కుటుంబ సభ్యులు

అచ్చంపేట రూరల్: మండలంలోని గుంపన్‌పల్లికి చెందిన బాలు (42) ఈ నెల 24న ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా నక్కెర్లపెంటకు చెందిన అంజి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలుకు తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. తమకు న్యాయం చేయాలంటూ బాధిత కుటుంబం గురువారం అచ్చంపేట పోలీస్‌స్టేషన్ ఎదుట రాస్తారోకో చేశారు. దీంతో చాలా సమయం వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎస్ఐ రమేష్ వారితో మాట్లాడి కేసు నమోదు చేశామని సర్ది చెప్పి పంపించారు.

పాలమూరులో క్రీడాసందడి



సీఎం కప్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ముస్తాబైన మెయిన్ స్టేడియం

సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి కబడ్డీ పురుషుల, మహిళా చాంపియన్‌షిప్
- 33 జిల్లాల నుంచి తరలిరానున్న 850 మంది క్రీడాకారులు
- 150 మంది అఫీషియల్స్ రాక
- ఆరు మ్యాట్‌లపై మ్యాచ్‌ల నిర్వహణ

మహబూబ్‌నగర్ క్రీడలు: పాలమూరు మరో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు వేదిక కానుంది. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ నిర్వహిస్తోంది. ఇప్పటికే గ్రామ, మండల, జిల్లాస్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహించారు. పాలమూరుకు రెండు రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలను కేటాయించగా.. స్థానిక మెయిన్ స్టేడియంలో శుక్రవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు కబడ్డీ చాంపియన్‌షిప్ నిర్వహించనున్నారు.

క్రీడాకారులకు వసతి సౌకర్యం..

జిల్లా కేంద్రంలోని క్రీస్తు జ్యోతి పాఠశాల, ఎంవీఎస్‌లోని ఇండోర్ స్టేడియం, అంబేద్కర్ కళాభవన్, రెయిన్‌బో స్కూల్‌లో పురుషులకు, మహిళా డిగ్రీ కళాశాల, బీపీహెచ్‌ఎస్ స్కూల్, మోడ్రన్ హైస్కూల్‌లో మహిళలకు వసతి సౌకర్యం ఏర్పాటు చేశారు. మెయిన్ స్టేడియంలో క్రీడాకారులందరికీ భోజన వసతి కల్పించనున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు స్టేడియంలో రాష్ట్రస్థాయి సీఎం కప్ కబడ్డీ టోర్నీ ప్రారంభోత్సవానికి మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర క్రీడల వ్యవహారాల సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.

విజయవంతంగా నిర్వహిస్తాం..



రాష్ట్రస్థాయి సీఎం కప్ కబడ్డీ చాంపియన్‌షిప్‌ను అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తాం. ఇప్పటికే జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలను పూర్తిచేశాం. టోర్నీలో పాల్గొనే క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాట్లు చేశాం. - ఎస్.శ్రీనివాస్, డీవైఎస్‌ఓ

సంతోషంగా ఉంది..



జిల్లాకు రాష్ట్రస్థాయి సీఎం కప్ కబడ్డీ చాంపియన్‌షిప్ కేటాయించినందుకు చాలా సంతోషంగా ఉంది. సీఎం కప్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. రాష్ట్రస్థాయి టోర్నీ విజయవంతం కోసం జిల్లా కబడ్డీ సంఘం తరఫున పూర్తి సహకారం అందిస్తాం. - కురుమూర్తిగౌడ్, జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి

లీగ్ కం నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు..

రాష్ట్రస్థాయి సీఎం కప్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు 33 జిల్లాల నుంచి 850 మంది పురుషుల, మహిళలు, 150 మంది అఫీషియల్స్ తరలిరానున్నారు. మెయిన్ స్టేడియంలో ఆరు మ్యాట్‌లలో లీగ్ కం నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. 33 జిల్లాల జట్లను 8 పూల్‌లుగా విభజించారు. పురుషుల విభాగం పూల్-ఏలో రంగారెడ్డి, భూపాలపల్లి, నిజామాబాద్, మేడ్చల్.. బీలో సూర్యాపేట, హన్మకొండ, మహబూబాబాద్, కొత్తగూడెం.. సీలో నల్లగొండ, నారాయణపేట, ఖమ్మం, సిరిసిల్ల.. డీలో గద్వాల, ఆసిఫాబాద్, జనగాం, నిర్మల్.. ఈలో నాగర్‌కర్నూల్, సిద్దిపేట, వికారాబాద్, జగిత్యాల.. ఎఫ్‌లో కామారెడ్డి, సంగారెడ్డి, పెద్దపల్లి, హైదరాబాద్.. జీలో కరీంనగర్, మంచిర్యాల, ఆదిలాబాద్, వరంగల్.. హెచ్‌లో ములుగు, వనపర్తి, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, మెదక్ జట్లు ఉన్నాయి.

- మహిళల విభాగం పూల్-ఏలో నల్లగొండ, కామారెడ్డి, మేడ్చల్, నిజామాబాద్ జట్లు ఉన్నాయి. పూల్-బీలో రంగారెడ్డి, నిర్మల్, ములుగు, సిద్దిపేట.. సీలో హైదరాబాద్, ఆసిఫాబాద్, హన్మకొండ, నారాయణపేట.. డీలో ఖమ్మం, జగిత్యాల, భూపాలపల్లి, మహబూబాబాద్, ఈలో యాదాద్రి భువనగిరి, వరంగల్, కరీంనగర్, జోగుళాంబ గద్వాల.. ఎఫ్‌లో మహబూబ్‌నగర్, కొత్తగూడెం, సిరిసిల్ల, ఆదిలాబాద్.. జీలో మంచిర్యాల, వనపర్తి, జనగాం, సూర్యాపేట.. హెచ్‌లో సంగారెడ్డి, నాగర్‌కర్నూల్, వికారాబాద్, మెదక్, పెద్దపల్లి జట్లు ఉన్నాయి.

వాలీబాల్ విజేత ఉత్తరప్రదేశ్



విజేత ఉత్తరప్రదేశ్ జట్టుకు బహుమతి అందజేస్తున్న ఐజీ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి తదితరులు

- రెండు, మూడు స్థానాల్లో గుజరాత్, సీబీఎస్ఈ జట్లు
- ముగిసిన జాతీయస్థాయి అండర్-19 పోటీలు

కోస్గి: హోరాహోరీగా సాగిన వాలీబాల్ పోటీల్లో ఉత్తరప్రదేశ్ జట్టు విజేతగా నిలిచింది. ఉత్తరప్రదేశ్, గుజరాత్ జట్ల మధ్య నువ్వా.. నేనా అన్నట్లుగా సాగిన ఫైనల్ పోటీలో ఉత్తరప్రదేశ్ గుజరాత్‌పై 22-25, 25-18, 25-20, 25-16 స్కోర్‌తో విజయం సాధించి జాతీయస్థాయిలో మొదటి స్థానం దక్కించుకుంది. గుజరాత్ రెండోస్థానం దక్కించుకోగా మూడోస్థానం కోసం సీబీఎస్ఈ, రాజస్థాన్‌ల మధ్య జరిగిన పోటీల్లో సీబీఎస్ఈ విజయం సాధించి మూడోస్థానంలో నిలిచింది. దీంతో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఐదు రోజులుగా కొనసాగిన జాతీయ స్థాయి అండర్- 19 బాలుర వాలీబాల్ పోటీలు గురువారం ముగిశాయి. ఈ పోటీల్లో దేశంలోని 21 రాష్ట్రాలు, 4 కేంద్ర పాలిత ప్రాంతాలతోపాటు 7 కేంద్ర విద్యా సంస్థలకు చెందిన 32 జట్లు పాల్గొన్నాయి.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

క్రీడాకారులు ఆటల్లో గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తిని చాటడం ద్వారా మరింత ఉన్నత స్థాయికి ఎదగవచ్చని ఐజీ సత్యనారాయణ అన్నారు. జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో విజేతలైన వారికి బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఐజీతోపాటు కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ జాతీయ స్థాయి క్రీడలు రాష్ట్రంలోని కోస్గిలో నిర్వహించి విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. కోస్గి వేదికగా ప్రతిభచూపిన క్రీడాకారుల నుంచే జాతీయ జట్టును ఎంపిక చేసి అంతర్జాతీయ పోటీలకు పంపిస్తారని, గ్రామీణ ప్రాంతాల్లో ఉండే క్రీడాకారులు ఇలాంటి పోటీలను ఆదర్శంగా తీసుకొని క్రీడల్లో రాణించాలన్నారు.

➯ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించేందుకు సీఎం కప్ పోటీలు నిర్వహించారన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి, కాడా చైర్మన్ వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ విజయ్‌కుమార్, డీవైఎస్‌ఓ వెంకటేష్‌శెట్టి, టోర్నమెంట్ ఆర్గనైజర్లు పాపిరెడ్డి, రవీందర్‌రెడ్డి, బాలరాజు, నర్సింహారెడ్డి, రవికుమార్, రాధిక, శ్రీనివాస్‌రెడ్డి, స్వప్న, పీడీలు రమణ, సాయినాథ్, శేఖర్, రాజేశ్వరి, విష్ణు, రామకృష్ణారెడ్డి, పర్వీన్, జగదీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

➯ జాతీయ స్థాయి పోటీల్లో విజేతగా నిలిచిన ఉత్తరప్రదేశ్ జట్టును పలు బీసీ, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్థానిక వేద పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కోచ్ విశాల్, కెప్టెన్ ఆరవ్ లాతీయన్‌తో పాటు జట్టులోని క్రీడాకారులను సన్మానించారు. ఇందులో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, నియోజకవర్గ అధ్యక్షుడు బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఫైనల్‌లో తలపడుతున్న ఉత్తరప్రదేశ్- గుజరాత్ జట్లు

టూరిజం హబ్‌గా నల్లమల

- పోడు భూముల రైతులకు పూర్తిస్థాయి హక్కులు కల్పిస్తాం
- రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ



మంత్రి కొండా సురేఖకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డి

మన్ననూర్: రాష్ట్రంలోని ప్రకృతి సహజ పరిసర ప్రాంతాలతో పాటు నల్లమలను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం సాయంత్రం మన్ననూర్‌లోని అటవీశాఖ విశ్రాంతి భవనంలో అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణతో కలిసి మంత్రి విలేకరులతో మాట్లాడారు. వన్యప్రాణుల సంరక్షణను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం దేశంలోనే అతిపెద్ద ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించ తలపెట్టిందని అన్నారు. అందుకోసం రూ. 7,700 కోట్ల నిధులు వెచ్చిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వాన్ని కూడా సంప్రదిస్తుందని తెలిపారు. ఇక్కడ నెలకొన్న కోతుల బెడదను తగ్గించడానికి అడవుల్లో పండ్ల మొక్కలు పెంచేందుకు అటవీశాఖ ప్రయత్నాలను ముమ్మరం చేసిందన్నారు. నల్లమల అటవీ పరిసర ప్రాంతంలో సుమారు కోటి టేకు మొక్కలు నాటేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. అడవుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉన్నప్పుడే.. అడవులు, వన్యప్రాణులు రక్షించబడుతాయని అన్నారు. కాగా, రైతులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పూర్తిస్థాయిలో హక్కులు కల్పిస్తామన్నారు. ఇదే క్రమంలో అనుమతి లేకుండా అటవీ ప్రాంతంలో సంచరించడం.. చెట్లను నరకడం.. వన్యప్రాణులను వేటాడటం వంటి చర్యలకు పాల్పడే వారితో పాటు మైదాన ప్రాంతం, ఇతర రాష్ట్రాల నుంచి అటవీ ప్రాంతంలోకి వచ్చే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అభయారణ్యంలో నివాసం ఉంటున్న వారు స్వచ్ఛందంగా పునరావాసం కోరుకుంటే.. అలాంటి వారికి ప్రభుత్వం తరఫున అన్ని అవకాశాలు కల్పిస్తామన్నారు. అటవీ శాఖకు చెందిన ఒక ఇంచు భూమి కూడా అన్యాక్రాంతం కావడానికి అవకాశం లేకుండా చట్టాలను పునరుద్ధరించినట్లు వివరించారు. ఎకో టూరిజం అభివృద్ధికి సంబంధించిన ఫైల్ సీఎం వద్ద ఉందని.. అది వస్తే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అంతకుముందు కోర్ ఏరియాలో జాతీయ రహదారి నిర్మాణం, ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన డీపీఆర్‌కు సంబంధించిన వివరాలను ఎమ్మెల్యే వంశీకృష్ణ, డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డి మ్యాప్ ద్వారా మంత్రికి వివరించారు. అనంతరం శ్రీశైలం - హైదరాబాద్ ప్రధాన రహదారిలో ఎస్ఆర్ఐ పాపారావు ఏర్పాటు చేసిన హంస రెస్టారెంట్‌ను మంత్రి ప్రారంభించారు. అక్కడి నుంచి కుటుంబ సభ్యులతో కలిసి వ్యూ పాయింట్‌ను సందర్శించారు. మంత్రి పర్యటన సందర్భంగా డీఎస్పీ శ్రీనివాస్, సీఐ రవీందర్, ఎస్ఐ రజిత భద్రతా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అంతటి రజిత, మల్లేష్, కాశన్న యాదవ్, రహీం, శ్రీనివాసులు, రవి, మేరాజ్, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, హన్మంత్‌రెడ్డి, హరినారాయణ, వెంకటయ్య, సత్యనారాయణ, రాజారాం, శంకరయ్య, తిరుపతి పాల్గొన్నారు.

శ్రీవారి సముద్రంలో స్పీడ్ బోట్లు ఏర్పాటు



శ్రీవారి సముద్రం రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీవారి సముద్రం రిజర్వాయర్‌లో స్పీడ్ బోట్లు ఏర్పాటు చేస్తామని పర్యాటకశాఖ జిల్లా అధికారి నర్సింహ చెప్పారు. గురువారం సింగోటం దేవస్థానం అధికారి జైపాల్‌రెడ్డితో కలిసి రిజర్వాయర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులు శ్రీవారి సముద్రం రిజర్వాయర్‌లో విహరించేందుకు గాను ఐదు స్పీడ్ బోట్లు ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు భక్తులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రిజర్వాయర్ కట్టపై ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేయిస్తామన్నారు. వారి వెంట ఆలయ సిబ్బంది ఉన్నారు.

మైసమ్మ ఆలయ అభివృద్ధికి కృషి



ఆలయ ఆవరణలో ప్రమాణా స్వీకారం చేస్తున్న పాలకవర్గ సభ్యులు.. చిత్రంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

నవాబుపేట: జిల్లాలో ప్రసిద్ధి చెందిన పర్వతాపూర్ మైసమ్మ దేవాలయ్యాన్ని ప్రత్యేక నిధులతో మరింత అభివృద్ధి చేస్తానని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రకటించారు. గురువారం ఆలయ ఆవరణలో జరిగిన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అటవీ ప్రాంతంలో ఆహ్లాదకర వాతావరణంలో ఉన్న ఆలయం గురించి అసెంబ్లీలో ప్రస్తావించానని.. ఆలయానికి కావాల్సిన 5 ఎకరాల భూమిని త్వరలో అప్పగించే ప్రక్రియ ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని ఆలయాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకులను సన్మానించేందుకు శాలువాల కొనుగోలుకుగాను రూ.లక్షలు ఖర్చు చేస్తున్నట్లు ఇటీవల ఊర్కొండపేట ఆంజనేయస్వామి ఆలయంలో బయట పడిందని.. నేటి నుంచి ఆలయ నిధులు ఖర్చు చేయకూడదని అధికారులకు సూచించారు. ఆలయ అభివృద్ధి లేదా అమ్మవారి ఆభరణాల కొనుగోలుకు సొంత నిధులు రూ.కోటి అందిస్తానని వెల్లడించారు.

చైర్మన్‌గా జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణం..

మైసమ్మ ఆలయ చైర్మన్‌గా కాకర్లపహాడ్‌కు చెందిన జగన్‌మోహన్‌రెడ్డి, సభ్యులు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన కార్యవర్గం ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ అధికారి మధనేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు దుష్యంత్‌రెడ్డి, అల్వాల్‌రెడ్డి, వాసుయాదవ్, రామచంద్రయ్య, బంగ్లా రవి, వెంకటేష్‌గౌడ్, భూపాల్‌రెడ్డి, తులసీరాంనాయక్, రాజేష్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బండారం బయటపెడతా..

జనవరి మొదటి వారంలో జడ్చర్లలో సంచలన ప్రెస్‌మీట్ ఉండబోతుంది.. అందులో బీఆర్ఎస్ నాయకుల అవినీతిని బయట పెడతానని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. అందులో అక్రమ పట్టాలు, అన్యాయంగా లాక్కున్న భూముల వ్యవహారం మొత్తం చాప్టర్-1 రూపంలో ఉంటుందని వివరించారు. ముదాలో జడ్చర్ల నియోజకవర్గం నుంచి రూ.30 కోట్లు జమచేస్తే ఒక్క రూపాయి కూడా రాకుండా జిల్లాకేంద్రానికే పరిమితం చేశారని మాజీ ఎమ్మెల్యేపై మండిపడ్డారు. గత పాలకుల మూలంగా అభివృద్ధిలో ఎంత నష్టపోయామో ప్రజలకు తెలిసేలా సమగ్రంగా వివరిస్తానని చెప్పారు.

సైబర్ క్రైంలో మహమ్మదాబాద్ మండలవాసులు?

- రుణాల పేరిట రూ.5 కోట్ల కుచ్చుటోపీ
- బీహార్‌లో అరెస్టయిన వారిలో ముగ్గురు ఇక్కడి వారిగా ప్రచారం

మహమ్మదాబాద్: సైబర్ నేరాల్లో మహమ్మదాబాద్ మండలానికి చెందిన పలువురు అరెస్టు కావడం కలకలం రేపుతోంది. మహమ్మదాబాద్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు సైబర్ నేరాలకు పాల్పడి అరెస్టు అయినట్లు బీహార్ మీడియాలో పోలీసులు చెప్పినట్టు వార్తలు వచ్చాయి. రుణాల పేరుతో ప్రజలను మోసం చేసేందుకు ఐదుమంది జట్టుగా ఏర్పడిన వారిలో నలుగురు తెలంగాణ వాసులుగా ఉండగా.. వారిలో ముగ్గురు మహమ్మదాబాద్ మండలానికి చెందిన వారిగా ప్రచారం జరుగుతోంది. బీహార్‌లోని పాట్నాలో ఐదురుగు వ్యక్తులను రెండు రోజుల క్రితం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్టు సమాచారం. ఈసైబర్ క్రైంకు పాల్పడిన వారు ముగ్గురు వ్యక్తులు ఒకే గ్రామానికి చెందినవారని స్థానికంగా చర్చించుకుంటున్నారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు ఆరా తీసినట్లు తెలిసింది. నేరానికి పాల్పడిన వారు అరెస్టు కావడంతో దాదాపు రూ.5 కోట్ల వరకు ప్రజలను నమ్మించి మోసం చేశారని అక్కడి పోలీసులు నిందితుల కుటుంబీకులకు సమాచారం అందించారని సమాచారం. నిందితుల ఇళ్లు, వాహనాలు ఇతర రుణాల పేరుతో పలు బ్యాంకుల్లో రుణాలు ఇప్పిస్తామని డ్యాకుమెంట్ తయారు చేస్తామని ఆధార్, పాన్ కార్డు, అకౌంట్ నంబర్ల వివరాలు తీసుకుని దాదాపు 2 వేల డ్యాకుమెంట్లకు గాను సుమారు రూ.5 కోట్ల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది.

- ఈ విషయమై మహమ్మదాబాద్ ఎస్ఐ శేఖర్‌రెడ్డి స్పందిస్తూ.. తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు. మరోదిక్కు ఈ విషయాన్ని కుటుంబీకులు సైతం గోప్యంగా ఉంచారు. అయితే తమ వారి విడుదల కోసం ప్రయత్నాలు మొదలుపెట్టినట్టు సమాచారం.

9,070 క్యూసెక్కుల నీటి తరలింపు

దోమలపెంట: భూగర్భ కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతిలో ఇరవై నాలుగు గంటల వ్యవధిలో శ్రీశైలం ఆనకట్ట దిగువన సాగర్ జలాశయం నుంచి ఆనకట్ట ఎగువన శ్రీశైలం జలాశయంలోకి 9,070 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోశారు. పోతిరెడ్డిపాడు ద్వారా 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,590 క్యూసెక్కులు, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 434, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గురువారం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 862.2 అడుగుల వద్ద 112.7164 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

నిండుకుండలా రామన్‌పాడు జలాశయం

మదనాపురం: రామన్‌పాడులో గురువారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ 640 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 800 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వ ద్వారా 10 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.

బోయిన్‌పల్లిలో పట్టపగలు చోరీ

- రూ.33 వేల నగదు, 50 తులాల వెండి, తులం బంగారు అపహరణ



బీరువా పగలగొట్టి చోరీకి పాల్పడిన దుండగులు

మిడ్జిల్: మండలంలోని బోయిన్‌పల్లిలో గురువారం మధ్యాహ్నం రెండు ఇళ్లలో చోరీ జరిగిన ఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ శివనాగేశ్వర్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన మునీర్ ఇంటికి తాళం వేసి రోడ్డు పైన ఉన్న కిరాణం షాప్‌కు వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.33వేల నగదు, 30తులాల వెండి, తులం బంగారు అపహరించారు. అలాగే అదే గ్రామంలో కృష్ణయ్య ఇంట్లో 20తులాల వెండి, 2గ్రాముల బంగారం దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటన స్థలాన్ని సీఐ నాగార్జునగౌడ్, క్లూస్ టీం పరిశీలించి వివరాలు సేకరించారు.